క్లుప్తంగా

నర్సింగ్ కోర్సులో ఉచిత ప్రవేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ తదితర పేద వర్గాలకు చెందిన బాలికలకు నర్సింగ్ కోర్సులో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు జేపీ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ ఈదూరు పద్మాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కృష్ణానగర్‌లోని సొసైటీ ఫర్ హోలీ పవర్ ఆధ్వర్యంలో కళాశాల కొనసాగుతుందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన బాలికలు నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశం పొందిన వారికి ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 96031 68772, 98483 52725 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నిందితులపై కేసు నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఓల్డ్‌సిటీలోని మాసుంబాషా దర్గా సమీపంలో మున్నా అనే వ్యక్తికి చెందిన ఆటోను తగలబెట్టిన వారిపై కేసు నమోదు చేయాలని ఏపీ ఆటో ట్రాలీ అండ్ ఫోర్ వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి సమయంలో తాగుబోతులే ఆటోను తగలబెట్టి ఉంటారని, వారిని గుర్తించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మున్నాకు తగిన నష్ట పరిహారం అందించాలని కోరారు.

డార్విన్ సిద్ధాంతం కొనసాగించాలి

కర్నూలు సిటీ: నూతన జాతీయ విద్యా విధానం పేరుతో పాఠ్య పుస్తకాల్లో డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడాన్ని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప అన్నారు. గురువారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చరిత్ర పాఠ్యాంశాలలో మొఘల్ సామ్రాజ్యం, ప్రజాస్వామ్య ఉద్యమాలు, హక్కులు తదితర వాటిని తొలగిస్తున్నారన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. సంఘం నాయకులు బజారప్ప, రత్నం ఏసేపు, షూఖూర్, భీషన్న, మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. ఆయన గురువారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు మూడు రోజులుగా గాలి, వర్షాలు ఉంటున్నాయని, వీటి వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యంగా గాలికి బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, ఫీడర్ డౌన్ వంటి సమస్యలు తెలుత్తుతాయని పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.

క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం



వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీధర్‌రెడ్డి

కర్నూలు (టౌన్): విద్యార్థులకు క్రీడలు అవసరమని న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ వేసవి క్రీడా శిక్షణా శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను సెల్ ఫోన్‌తో, టీవీలతో కాలక్షేపం చేయవద్దని, స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన యువ క్రీడాకారుల రాణింపే లక్ష్యంగా రాష్ట్ర క్రీడా శాఖ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం జిల్లావ్యాప్తంగా వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి, బి.క్యాంపు ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి పాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కస్టడీ,రామబాణం,ఉగ్రం విరుపాక్ష, ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్-2 మ్యూజిక్ స్కూల్, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కస్టడీ,ఫర్హానా భువన విజయం,ఉగ్రం,విరుపాక్ష,రామబాణం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : కస్టడీ,ఉగ్రం,విరుపాక్ష
ఐనాక్స్ : గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3,ఉగ్రం ది కేరళ స్టోరీ,ఐబీ 71,ఛత్రపతి,ది స్టోరీ ఆఫ్ ఎ బ్యూటిఫుల్ గర్ల్, భువన విజయం
భరత్‌కాంప్లెక్స్ : ఇవిల్‌డెడ్ రైజ్,విడుదల పార్ట్-1 రుద్రుడు
శ్రీరామ : రామబాణం
రాజ్ : కస్టడీ
విజయ : రామబాణం

కాలుష్య కాసారం



ధర్మపేట వద్ద కేసీ కెనాల్‌లో వేసిన చెత్త కుప్పలు

సుంకేసుల నుంచి వైఎస్సార్ జిల్లా వరకు రైతాంగానికి సాగునీటిని అందించేవరప్రధాయిని కేసీ కాల్వ కర్నూలు నగరంలో చెత్త బుట్టను తలపిస్తోంది. నగరంలోని ధర్మపేట నుంచి జొహరాపురం వరకు కర్నూలు నడిబొడ్డున కేసీ కెనాల్ పారుతుంది. వేసవిలో కాల్వకు నీటి సరఫరా నిలిచిపోగా నగర ప్రజలు ఇష్టానుసారంగా చెత్త, ఇతర వ్యర్థాలను వేయడంతో పాటు మురుగునీటిని వదలడంతో డంప్ యార్డును తలపిస్తోంది. కాలువ పరిసరాల్లోకి వెళితే దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెత్త నిర్వహణ కోసం మున్సిపాలిటీ ఇంటింటికీ ప్లాస్టిక్ డబ్బాలను పంపిణీ చేసింది. రోజూ మున్సిపల్ సిబ్బంది వీధుల్లో విజిల్ వేసుకుంటూ తిరుగుతూ ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంప్ యార్డుకు తరలిస్తున్నారు. అయినా లెక్కచేయకుండా కేసీ కెనాల్ చుట్టుపక్కల ఉంటున్నవారు కాల్వను చెత్తతో నింపేశారు. కాలువలో మురుగు నీరు కూడా చేరడంతో దోమలు వృద్ధి చెంది వివిధ రోగాల భారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువను శుభ్రం చేసి, చెత్త వేయకుండా చూడాలని, రైతులకు వరప్రధాయినిగా ఉన్న నీటి వనరును సంరక్షించుకోవాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



గణేష్ నగర్ వద్ద..



ధర్మపేట వద్ద..



వినాయక ఘాట్ వద్ద..



జొహరాపురం బ్రిడ్జి వద్ద..



కేవీఆర్ కళాశాల వద్ద..

నేటి నుంచి మహాయజ్ఞం

కర్నూలు కల్చరల్: దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న మహాయజ్ఞానికి మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులను ఆహ్వానించినట్లు దేవదాయ శాఖ కర్నూలు అసిస్టెంట్ కమీషనర్ ఆదిశేషునాయుడు తెలిపారు. గురువారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఆయన్ను కలిసి మహాయజ్ఞం వివరాలు వెల్లడించామన్నారు. భారతీయ సంస్కృతి సనాతన ధర్మ పరిరక్షణార్థం ఆంధ్ర రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి - సమస్త ప్రజల శాంతి సౌభాగ్యాలు, పాడి పంటల సమృద్ధి - ప్రకృతి మాత అనుగ్రహంకోసం అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మి మహాయజ్ఞం జరుగుతుందన్నారు. శుక్రవారం రాత్రి విజయవాడ ఇంద్రకీలాద్రిలో దుర్గా మల్లేశ్వర స్వామి, 13వ తేదీ రాత్రి 7.30 గంటలకు ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి, 14వ తేదీ రాత్రి 7.30 గంటలకు అన్నవరం రమా సమేత వీర వేంకట సత్యనారాయణ స్వామి, 15వ తేదీ రాత్రి 7.30 గంటలకు భ్రమరాంబా మల్లికార్జున స్వామి, 16వ తేదీ రాత్రి 7.30 గంటలకు సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వార్ల కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 17వ తేదీ మహా పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు.



మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులుకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఆదిశేషు నాయుడు

క్రైస్తవ ఆస్తులను పరిరక్షించండి

కర్నూలు (టౌన్): క్రైస్తవ ఆస్తులను పరిరక్షించాలని క్రైస్తవ ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి జాషువా డానియల్ అన్నారు. గురువారం గుంటూరు మంగళగిరిలో క్రిస్టియన్ మైనార్టీ కమిషన్ చైర్మన్ కె.ఇక్బాల్ ఖాన్‌ను క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు కలిసి సమస్యలను వివరించారు. క్రైస్తవులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. క్రైస్తవ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలపై రాష్ట్రస్థాయిలో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు జాన్ విల్సన్ పాల్, క్రైస్తవ హక్కుల పోరాట నాయకులు ఎస్.జయకాంత్ తదితరులు ఉన్నారు.



క్రిస్టియన్ మైనార్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు

14న సంతకాల సేకరణ

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యల సాధనకు ఈనెల 14వ తేదీన కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి ప్రకటించారు. ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో సంతకాల సేకరణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణంతో రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారుతుందని, ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నెల 14వ తేదీన 8 జిల్లాల్లోని 52 నియోజకవర్గాల్లో సంతకాల సేకరణ జరుగుతుందన్నారు. వీటితో చలో విజయవాడ, ఆ తర్వాత చలో ఢిల్లీ కార్యక్రమాలు చేపడతామన్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు సీమకృష్ణ, శ్రీధర్, మురళి, నవీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సర్వే సకాలంలో పూర్తి చేయండి

కల్లూరు: ప్రభుత్వం సూచించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయన గురువారం మండలంలోని కొంగనపాడు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్, జగనన్నకు చెబుదాం, స్పందన, జాబ్ కార్డు ఉన్నవారందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. గ్రామంలో మహిళల ఆరోగ్య పరిస్థితి, ఐఎఫ్ఏ-ట్యాబ్‌లెట్స్, ఇళ్ల నిర్మాణల సర్వేలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు ఫేజ్-2 పనులు పరిశీలించారు. పనులు జరుగుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా ప్రతిరోజు పాఠశాలలకు హాజరుకావాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగార్జున, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

14న బాలికల క్రికెట్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు సీనియర్స్, అండర్-23, అండర్-19, అండర్-15 విభాగంలో జిల్లాస్థాయి బాలికల క్రికెట్ జట్ల ఎంపిక ఉంటుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్ర గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. 2008 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారు అర్హులని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

వ్యవసాయాధికారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): నకిలీ విత్తనాలను అరికట్టలేని జిల్లా వ్యవసాయాధికారిని (డీఏఓ) బదిలీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే నకిలీ విత్తనాల వ్యాపారం జోరుగా సాగుతున్నా చర్యలు తీసుకోవడంలో డీఏఓ నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గత సంవత్సరం నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నూజివీడు, కావేరిజాదు కంపెనీలు నకిలీ విత్తనాలను జోరుగా అమ్మకాలు సాగిస్తున్నాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టి నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరారు.

లోకేష్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలుకు చెందిన ముస్లిం ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌పై తప్పుడు ఆరోపణలు చేసిన టీడీపీ నేత నారా లోకేష్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు రాష్ట్ర మైనారిటీ కమిషన్‌కు విన్నవించారు. గురువారం ఆ సమితి సభ్యులు విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్ ఖాన్ తెలిపినట్లు సమితి ప్రతినిధులు షేక్ నాగుల్ మీరా, ఎస్‌కే రఫీ, హుసేన్ సుభాని, జాకీర్, మౌలాలి పేర్కొన్నారు.

కోలుకోలేక మున్సిపల్ కార్మికుడి మృతి

కర్నూలు: అనారోగ్యం బాధ తాళలేక క్రిమిసంహారక మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ కార్మికుడుగా పనిచేస్తున్న గోపి (30) మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతుండేవాడు. ఈనెల 9వ తేదీన ఇంట్లో క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితిలో పడిఉండగా కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో కోలుకోలేక గురువారం మృతిచెందాడు. భార్య శాంతి ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14న లాసెట్ మోడల్ పరీక్ష

కర్నూలు(లీగల్): ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన ఉచితంగా మోడల్ లాసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీనయ్య సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.నాగరాజు యాదవ్ తెలిపారు. కర్నూలులో ఎన్ఆర్ పేటలోని శ్రీలక్ష్మీ హైస్కూల్లో ఉదయం 10గంటల నుంచి 11:30 గంటల వరకు మోడల్ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. వివరాలకు ఎం.వి.చక్రపాణి – 94413 00262, వి.శ్రీరాములు – 70133 72238 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించాలి

కర్నూలు సిటీ: విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించాలని కోరుతూ ఫ్యాప్టో నాయకులు గురువారం డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మెన్ గోకారి, సెక్రటరీ జనరల్ గట్టు తిమ్మప్పలు మాట్లాడుతూ.. వేసవి సెలవులలో ఉపాధ్యాయులకు ఎస్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన బాధ్యతలకు సంబంధించి గానీ, వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమాలకు సంబంధించి గానీ, పదవ తరగతి పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించేందుకు కేవలం ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతోనే ఉపాధ్యాయులతో పని చేయిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇతర శాఖల మాదిరిగానే విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించి ఉపాధ్యాయుల చేత నిర్వహించుకునే కార్యక్రమాలకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో నాయకులు జయరాజు, టి.కె జనార్దన్, మారియానందం, సతీష్‌కుమార్, యోగీశ్వర్, సుధాకర్, నాగరాజు, శ్రీధర్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

గరిష్ట వేతనం పొందేలా పని చేయండి

సి.బెళగల్: ఉపాధి కూలీలు దినసరి గరిష్ట వేతనం రూ.272 పొందేలా పనులు చేపట్టాలని మండల ఉపాధి హామీ ఈసీ పృథ్వీ సూచించారు. ఆయన గురువారం కొత్తకోట, ఇనగండ్ల గ్రామాలలో పర్యటించి అక్కడ జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరును పరిశీలించి మస్టర్ సమర్థవంతంగా నిర్వహించేందుకు మేటీలకు సూచనలు చేశారు. పని ప్రాంతంలో కూలీలకు అందాల్సిన సేవలు, వసతులు, సౌకర్యాలను కల్పించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని టీఏలను ఆదేశించారు. గ్రామాలలోని రైతులు ఉద్యానవన పంటల సాగుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం మునగ, పండ్ల తోటల పెంపకాలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈసీ వివరించారు. టీఏలు, ఎఫ్ఏలు, మేటీలు వెంట ఉన్నారు.

'విద్యాకానుక' పరిశీలన



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ విజయప్రసాద్

కోడుమూరు: మండలానికి మంజూరైన జగనన్న విద్యాకానుకలను ఐఈఆర్‌టీ, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ విజయప్రసాద్ పరిశీలించారు. గురువారం కోడుమూరులోని బాలుర హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. జగనన్న విద్యాకానుకలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించి పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థినులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. కో-ఆర్డినేటర్ వెంట ఎంఈఓ అనంతయ్య ఉన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే గరిష్ట వేతనం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కల్లూరు: ఉపాధి కూలీలు నిర్దేశిత కొలతల మేరకు పనిచేస్తే రోజుకు గరిష్ట వేతనం రూ.272 పొందవచ్చని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. ఆయన గురువారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కూలీలందరూ సమయపాలన పాటించాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉదయం త్వరగా వచ్చి పనులు పూర్తి చేసుకుని త్వరగా వెళ్లాలన్నారు. ఈసీ మధుసూదన్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

నాట్య మయూరి

- శాస్త్రీయ నృత్యంలో రాణిస్తున్న హర్షిత
- పలు జాతీయ స్థాయి పురస్కారాలు
- కూచిపూడిలో నంది అవార్డు కైవసం



నృత్య ప్రదర్శన ఇస్తున్న మల్లారి హర్షిత

కర్నూలు కల్చరల్: చిన్నతనంలో వెస్ట్రన్ డ్యాన్స్ స్టెప్పులు వేయడం, డ్యాన్సర్లను అనుకరించడం గమనించిన తల్లిదండ్రులు ఆ చిన్నారిని శాస్త్రీయ నృత్యంపై ప్రోత్సహించారు. నిపుణులైన గురువుల వద్ద కూచిపూడి, భరత నాట్యంలో శిక్షణ ఇప్పించారు. కర్నూలులోని ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో కూచిపూడి నృత్యంలో నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు డిప్లొమాలో ద్వితీయ సంవత్సరంలో ఉన్నారు మల్లారి హర్షిత. ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఫైనల్ ఇయర్ డిప్లొమా చదువుచున్న హర్షిత కూచిపూడి, భరతనాట్యంలో జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు కూచిపూడిలో నంది అవార్డును సొంతం చేసుకున్నారు.

హర్షిత కుటుంబ నేపథ్యం

హర్షిత తల్లిదండ్రులు ఎం.శిరీష (గృహిణి), ఎం.రాఘవేంద్ర (బీఎస్ఎన్ఎల్, ఎస్‌డీఈ). వీరు కర్నూలు ఎన్నార్ పేటలో నివాసం ఉంటున్నారు. కూచిపూడిలో గురువు నాగసాయి ప్రదీప్ వద్ద, భరత నాట్యంను గురువు ప్రతిమ సునీల్ (మార్కాపురం)వద్ద శిక్షణ పొందారు. కర్నూలు ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసి ప్రథమస్థానంలో నిలిచారు. ఏ రంగంలో స్థిరపడ్డా శాస్త్రీయ నృత్యాలను జీవితంలో ఒక భాగంగా చేసుకొని కొనసాగించడంతో పాటు ఇతరలకు నేర్పించాలన్నదే తన లక్ష్యమని హర్షిత అభిప్రాయం వ్యక్తం చేశారు.



సాధించిన పథకాలు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో హర్షిత

ఇచ్చిన ప్రదర్శనలు.. అందుకున్న ప్రశంసలు

- 2016లో సిలికాన్ ఆంధ్ర వారు నిర్వహించిన 5వ అంతర్జాతీయ కూచిపూడి డ్యాన్స్ కార్నివాల్‌లో పాల్గొన్న 6,117 మందిలో హర్షిత ప్రదర్శన ఇచ్చి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు.
- 2018లో ఓటర్స్ డే సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు.
- 2021లో యువజన సాంస్కృతిక శాఖ, సెట్కూరు వారు నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో జిల్లాస్థాయిలో భరతనాట్యంలో మొదటి స్థానం, కూచిపూడిలో ద్వితీయ స్థానంలో నిలిచారు.
- 2022లో యువజన సాంస్కృతిక శాఖ సెట్కూరు వారు గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో భరత నాట్యంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచారు.
- హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన ఇండియన్ క్రాఫ్ట్ మేలాలో ఉత్తమ ప్రదర్శన



మంత్రి రోజా చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న దృశ్యం

- హంపీలో నిర్వహించిన నేషనల్ డ్యాన్సింగ్ కార్నివాల్‌లో కూచిపూడి ప్రదర్శనకు గాను నంది అవార్డు కైవసం చేసుకున్నారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఉగాది మహోత్సవాల్లో 2017, 2018, 2019 సంవత్సరాలలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖులచే ప్రశంసలు అందుకున్నారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి వారు తిరుపతిలో నిర్వహించిన జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల్లో అత్యుత్తమ ప్రతిభతో మంత్రి రోజాచే ప్రశంసలు అందుకున్నారు.
- సంక్రాంతి సంబరాలు, తుంగభద్ర పుష్కరాలు, శ్రీశైలం మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో దేవస్థానం వారు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మన్ననలు అందుకున్నారు.